### నిరుద్యోగ భృతి కోసం నిరీక్షణ..



కూటమి నాయకులు ఎన్నికల హామీగా ఇచ్చిన నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం. కొత్త ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తోంది. కానీ ఇప్పటికీ నిరుద్యోగ భృతి కోసం మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియటం లేదు. 2014లో టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఐదేళ్లు గడిపేసింది. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుందని భావిస్తున్నాం.

-పాల దామోదరరెడ్డి, మెయిన్‌రోడ్డు, అల్లిపురం

### రూ.1500 ఇవ్వాల్సిందే..



18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి నాయకులు సూపర్ సిక్స్ ద్వారా ఎన్నికల ప్రచారంలో హోరెత్తించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్నే మరచిపోయారు. దీంతో మహిళల్లో తిరుగుబాటు మొదలయింది. మహిళలకు కచ్చితంగా రూ.1500 ఇవ్వాల్సిందే.

-డి. నాగమణి, మహారాణిపేట

### ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇవ్వండి



సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు భృతి ఇస్తామన్నారు. అధికారం చేపట్టి 100 రోజులు కావచ్చింది. కూటమి ప్రభుత్వం ఎక్కడా ఆ విషయమై మాట్లాడటం లేదు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఇవ్వకపోతే తిరగబడడం ఖాయం.

-వర్రి నాగ అరుణ్‌కుమార్, నిరుద్యోగి, 29వ వార్డు

### 'తల్లికి వందనం'లో జాప్యమెందుకు?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలు స్కూల్‌కు వెళ్తే అందరికీ రూ.15 వేలు వంతున ఇస్తామన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు చెప్పిన మాట ప్రకారం ఏడాదికి రూ.15 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేశారు. కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి. తల్లికి వందనం పథకం అమలు కోసం ఎంతో మంది తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.


-సారిక దైవకుమార్, ప్రైవేట్ స్కూల్ టీచర్, 37వ వార్డు

### 'సూపర్ సిక్సే' ఒక మోసం..



మోసపు హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. ఎన్నికల సమయంలో ఇస్తామని చివరికి సూపర్ సిక్స్ అంటూ తేల్చేశారు. అక్కడే మోసం బయట పడింది. 35వ వార్డులో 6,453 గృహాలుంటే తెల్ల కార్డు దారులు 4 వేలకు పైగా ఉన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం చూస్తే ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు చొప్పున ఇవ్వాలి. కానీ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తున్నా ఉచితం మాటే లేదు.

-రమణమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు



# బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

## -సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్

ఇంట్లో ఎందరు పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున అందజేస్తాం.. అమ్మకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు బ్యాంకు ఖాతాలో వేసేస్తాం... మీ ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేస్తాం... మీ ఇంటిలోని మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం... మీ ఇంటిలో చదువుకున్న నిరుద్యోగులుంటే ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగభృతి చెల్లిస్తాం... రైతులందరికీ అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు అందజేస్తాం... అధికారంలోకి రాగానే ఈ సూపర్ సిక్స్ పథకాలన్నీ పక్కాగా అమలు చేసేస్తాం అంటూ ఎన్నికల సమయంలో ఇంటింటికీ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి ప్రచారంలో ఉదరగొట్టారు... కూటమి నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తోసహా స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ మాయా మేనిఫెస్టోను ప్రజలకు చూపించి ఓట్లు అభ్యర్థించారు.. ఆ హామీలన్నీ జనం నమ్మి ఓట్లేసి అధికారం కట్టబెట్టేసరికి... పథకాలు అమలు చేయాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని చేతులెత్తేస్తుండడం గమనార్హం... పెట్టుబడి సాయం కోసం అన్నదాతలు... స్కూళ్లు తెరవడంతో రూ.15 వేల సాయం కోసం తల్లులు ఆశగా ఎదురు చూస్తున్నా... అందించే నాథుడు కనుచూపు మేరలో కనిపించడం లేదు... గత ఐదేళ్లలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీలన్నీ పక్కాగా అమలు చేశారని... ఆర్థికంగా అండగా నిలిచారని లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు మాత్రం అందుకు పూర్తి భిన్నమని... బాబు ష్యూరిటీ ఇస్తే... గ్యారెంటీ లేదని.. నమ్మిన జనాన్ని మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దక్షిణ నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం**



నియోజకవర్గంలో అర్హులు **1,35,000** మంది

**జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం**

అమ్మ ఒడి పథకం ద్వారా 19,360 మంది లబ్ధిదారులకు అందిన మొత్తం రూ. **72.08** కోట్లు

విద్యాదీవెన పథకం ద్వారా 12,817 మంది లబ్ధిదారులకు అందిన మొత్తం రూ. **37.10** కోట్లు

**టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం**



తల్లికి వందనం పథకం ద్వారా అందాల్సిన మొత్తం రూ. **29.07** కోట్లు

**ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు**



అర్హులు **43,038** మంది

ఇవ్వాల్సిన సిలిండర్లు **1,29,114**

వెచ్చించాల్సిన నిధులు రూ.**104,840,568**

**యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి**



అర్హత గల యువత **40,988** మంది

నెలకు అందాల్సిన నిరుద్యోగ భృతి రూ.**12.29** కోట్లు.

**ప్రతి మహిళకు నెలకు రూ.1500**



అర్హత గలవారు **98,207** మంది

నెలకు ఇవ్వాల్సిన మొత్తం రూ.**14.73** కోట్లు

### అమ్మకు వందనం ఎప్పుడిస్తారో?



కూటమి నాయకులు అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. ఒకరు 6వ తరగతి, మరొకరు 7వ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి స్కూళ్ల ప్రారంభమైన నెలలోనే మార్గదర్శకాలు విడుదల చేసి వివరాలు తీసుకునేవారు. ఈ ఏడాది అమ్మకి వందనంపై ఇప్పటి వరకు ఎటువంటి విధి విధానాలు రిలీజ్ చేయలేదు. ఆధార్ కార్డు ఉన్న తల్లికి మాత్రమే అమ్మకు వందనం అంటున్నారు. ఎలక్షన్లకు ముందు ఎంత మంది పిల్లలుంటే అంత మందికి అన్నారు. ఇప్పుడు ఒక్కరికి ఇస్తారో, ఇద్దరికి ఇస్తారో అర్థం కావటం లేదు.

- సొంటప్పు కనకమహాలక్ష్మి, నరహరిదొడ్డి

### ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో?



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని కూటమి నాయకులు ప్రచారం చేశారు. ఎన్నికల్లో గెలిచి వంద రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు దానిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. హామీలు అమలు చేస్తారో లేదో కూడా తెలియజేయడం లేదు. సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీల అమలు సాధ్యం కాదని ముఖ్యమంత్రితో పాటు మంత్రులు చెబుతున్నారు.

- ఎం.లక్ష్మీప్రసన్న, అల్లిపురం

### అంతా గ్యాస్



ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. స్థానికంగా కూడా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ హామీ అమలుకు పేదలంతా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతానికి కూటమి నాయకులు ఆ విషయం మరచిపోయారు. అవన్నీ ఎన్నికల సందర్భంగా చెప్పిన గ్యాస్ కబుర్లేనని ప్రజలకు అర్థమవుతోంది. వారి మాటలు కూడా నమ్మదగ్గవిగా లేవు. గతంలో చేస్తే కదా ఇప్పుడు నమ్మడానికి. ఇప్పుడు కూడా అంతే అనిపిస్తుంది.

- బోర వెంకటలక్ష్మి, స్థానికురాలు

### మూడు సిలిండర్లు ఏమయ్యాయి?



ప్రతి ఇంటికి కచ్చితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి రాష్ట్ర నేతలతో పాటు స్థానిక అభ్యర్థులు ఈ అంశంపై ప్రచారం చేశారు. ఇప్పుడేమో దాని గురించే మరచిపోయారు. పేదలంతా గ్యాస్ సిలిండర్లు ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నారు. అధికారంలోకి వచ్చాక ఇంత మోసం చేస్తారని అనుకోలేదు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదు.

- రెయ్య హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరమెట్ట

### ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు..



జీవీఎంసీ 35వ వార్డులో 22 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 14,000 వేల వరకు ఉన్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. ఇప్పుడు చంద్రబాబు ఆ ఊసే ఎత్తడం లేదు. అబద్ధాల కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారు.

- పుష్ప, 35వ వార్డు

### మర్యాదపూర్వక కలయిక



**మహారాణిపేట:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని క్రిస్టియన్ సెల్ విభాగం అధ్యక్షుడు జాన్‌వెస్లీ బుధవారం తాడేపల్లిలోని జగన్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకం పట్ల జాన్‌వెస్లీ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### జెడ్పీటీసీ సభ్యుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా



నూకరాజుతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుభద్ర

**మహారాణిపేట:** కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కొయ్యూరు జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజును విశాఖలోని ఆయుష్మాన్ భవ ఆస్పత్రిలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర బుధవారం పరామర్శించారు. నూకరాజు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.



## గణపతి సన్నిధిలో అన్నదానాలు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి

**అల్లిపురం:** పేదల ఆకలి తీర్చడంలో వెలకట్టలేని ఆనందం ఉందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. 38వ వార్డులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద జై హనుమాన్ బాయ్స్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అన్నప్రసాద కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, స్టార్‌మేకర్ సత్యానంద్, రవికుమారక్, గాయత్రి, జై హనుమాన్ కమిటీ చైర్మన్ ఎల్లారాజు, ముజీబ్‌ఖాన్, పోలరాజు, బుజ్జి, రామరాజు, సుధారాజు, ఆకుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

**యల్లమాంబ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో..**

జగదాంబ దరి యల్లమాంబ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అన్నసమారాధనను వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా ఆయన వినాయక స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ జైన్, వార్డు అధ్యక్షుడు బాపు ఆనంద్, దినేష్, మోహన్, గనగళ్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

**35వ వార్డులో..**

**జగదాంబ:** జీవీఎంసీ 35వ వార్డులో ప్రసాద్‌గార్డెన్స్ డ్రాగన్ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్ని మూడు వేలమందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డ్రాగన్ బాయ్స్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన కలిగిస్తున్న ముందస్తు ప్రసవాలు



కేజీహెచ్ ఎస్టీ సెల్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

**మహారాణిపేట:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముందస్తు ప్రసవాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళనకరమని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్‌లో గల సంబంధిత వార్డుల్లో బుధవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. ఏకంగా మూడు గదుల్లో ముందస్తు ప్రసవాలు జరిగిన పిల్లలు చికిత్స పొందుతుండటం ఆందోళనకరమన్నారు. గిరిజన ప్రాంతంలో పౌష్టికాహార లోపం, తల్లీబిడ్డకు సరిపడా ఆహారం తీసుకోకపోవడం, రక్తహీనత వల్ల ముందస్తు ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కిట్ పేరుతో గర్భిణులకు ప్రత్యేకంగా రూపొందించిన పౌష్టికాహార కిట్ అందించిందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోకపోతే అల్లూరి జిల్లాలో భయంకర పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.

### చట్రాపల్లి బాధితులకు జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

**మహారాణిపేట:** కొండ చరియలు విరిగిపడి తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జీకే వీధి మండలం చట్రాపల్లి గ్రామస్తులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర బుధవారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆమె కోరారు.

## అమ్మ పేరుతో ఒక మొక్క



కార్యక్రమంలో పాల్గొన్న ఏవీఎన్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

**అల్లిపురం:** పోర్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో మిసెస్ ఏవీఎన్ కళాశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛత హి సేవ 2024 కాంపెయిన్‌లో భాగంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో మిసెస్ ఏవీఎన్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పోర్టు అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు 800 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, కళాశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ మనిషికి ప్రకృతికి మధ్య ఉన్న బంధాన్ని తెలియజేశారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు.

### 21 నుంచి ఆయుర్వేద వైద్య శిబిరం

**అల్లిపురం:** ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ ఉన్ని కృష్ణన్ నాయర్ ఈ నెల 21 నుంచి 24 వరకు విశాఖ ప్రజలకు అందుబాటులో ఉంటారని వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. రామ్‌నగర్ కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 21, 22 తేదీల్లో మురళీనగర్ కేంద్రంలోను, 23,24 తేదీల్లో రామ్‌నగర్ వైద్యరాజ్ ఔషధాలయంలో డాక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. దీర్ఘకాల రోగాలకు పంచకర్మ విధానం ద్వారా కేరళ ఆయుర్వేదాన్ని అందించనున్నట్లు తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో మన్యుసూక్త హోమం



శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**మహారాణిపేట:** మెయిన్ రోడులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో బుధవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ హోమం నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు.

## ముఖ్యమంత్రి వాగ్దానం నిలబెట్టుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

**అల్లిపురం:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ గురించి వెలగపూడిలో చేసిన ప్రకటనలు, వాగ్దానాలు నిలబెట్టుకోవాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ బి.నాగభూషణం, కన్వీనర్లు ఎస్.కనకారావు, ఎం.వెంకటేశ్వర్లు, దొమ్మేటి అప్పారావు, ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సీఐటీయు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానివ్వమన్నారు. ఆఫీసర్లు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**బొలిశెట్టి వ్యాఖ్యల ఖండన..**

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంపైన, నిరాహారదీక్షల శిబిరాలపైన జనసేన జిల్లా నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ తీవ్ర అవమానకర రీతిలో చేసిన వ్యాఖ్యలను జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు.

### ఘనంగా దీపారాధన



స్వామి వారి సన్నిధిలో దీపారాధన దృశ్యం

**సీతమ్మధార:** దొండపర్తి కుప్పిలివారివీధిలో శ్రీ ఎరుకుమాంబ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక పూజల్లో భాగంగా బుధవారం ఘనంగా స్వామికి దీపారాధన జరిగింది. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి స్వామిని పూజించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీను, తరుణ్, హేమంత్, రాజు, మోహన్‌రెడ్డి, అమృత, నాయుడు, శ్రీకాంత్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

### వసతి గృహానికి యువతుల తరలింపు

**సీతమ్మధార:** అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు రాజస్థాన్, బెంగాల్ ప్రాంతాలకు చెందిన ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. మహిళా పోలీస్ ఎస్కార్ట్‌తో టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల మహిళల షెల్టర్‌లో ఆశ్రయం కల్పించి అనంతరం కోర్టులో వారిని హాజరు పరిచారు.

### ఎరుకుమాంబకు జలాభిషేకం

**సీతమ్మధార:** దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. అనంతరం అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.